సాక్షి సంగారెడ్డి
శనివారం । 3 । ఆగస్టు । 2024



పేద కుటుంబానికి పెద్ద ఆపద

విధి ఆడిన వింత నాటకంలో ఓ పేద బార్బర్ కుటుంబం చిన్నాభిన్నమైంది. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబానికి పుట్టెడు కష్టం వచ్చింది. వివరాలు 8లో ▸



చేప.. చెరువుకు చేరేనా?

చేప పిల్లల పంపిణీ ఆలస్యమయ్యేలా ఉంది. టెండర్లు పిలవగా కాంట్రాక్టర్లు ఎవరూ బిడ్ దాఖలు చేయలేదు. వివరాలు 8లో ▸



వానొస్తే నరకమే..

జహీరాబాద్–బీదర్ బైపాస్ రోడ్డు అధ్వానంగా మారి మడుగులను తలపిస్తుంది.

వివరాలు 9లో ▸

బోన సంబురం



పట్టణంలోని దుర్గభవాని అమ్మవారి బోనాల జాతర శుక్రవారం ముగిసింది. ఆఖరి రోజు గడీల వంశీయుల గృహం నుంచి నదర్ లింగమయ్యతో కల్లుకుండ ఊరేగింపు కార్యక్రమం ఆలయం వరకు కొనసాగింది. నదర్ లింగమయ్య చిన్న మేక పిల్లను కొరకడంతో జాతర ఉత్సవాలు ముగిశాయి. ఉత్సవాల్లో టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి, జయారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. సదాశివపేట(సంగారెడ్డి):

అలంకారం..



పట్టణంలోని మహంకాళీ ఆలయంలో అమ్మవారు శాకాంబరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆషాఢ మాసం చివరి శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పటాన్‌చెరు టౌన్:

తీజ్ ఉత్సవం



కంది మండల పరిధిలోని వెంకటరావు మక్త తండాలో శుక్రవారం తీజ్ పండగను వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం తండాలోని దుర్గాభవానీ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, పిల్లలు కోలాటం ఆడారు. అనంతరం తండా సమీపంలో గల చెరువులో పూజించిన నవధాన్యాల మొలకల బుట్టలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సురేష్ నాయక్ పాల్గొన్నారు. కంది(సంగారెడ్డి):

న్యూస్‌రీల్

వైభవంగా ఆరుద్ర నక్షత్ర వేడుకలు



సంగారెడ్డి టౌన్ : పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ఉన్న కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్ర వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు శివ, నాగరాజు ఆధ్వర్యంలో శివలింగానికి ఫలాభిషేకం, రుద్రాభిషేకం, భస్మాభిషేకాలను జరిపించారు. అనంతరం హోమం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వివిధ ట్రేడ్లకు సంబంధించి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మిషినిస్ట్, మెకానిక్ మోటార్ వెహికల్, వైర్‌మెన్, డ్రాఫ్‌మెన్, సివిల్, ఎలక్ట్రిక్ మెకానిక్, ఫ్యాషన్ డిజైన్, టెక్నాలజీ, వెల్డర్, మెకానిక్ డీజిల్ ట్రేడర్‌లో ప్రవేశాల కోసం http://iti.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 12వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు.

అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం



రాళ్లకత్వ మైనింగ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ వసంత కుమారి

సంగారెడ్డి : అక్రమ మైనింగ్‌ను సహించేది లేదని ఆర్డీఓ వసంతకుమారి హెచ్చరించారు. శుక్రవారం జిన్నారం మండలం రాళ్లకత్వ మైనింగ్‌ను ఆమె పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా.. వ్యవసాయ భూములకు, చెరువు కుంటలకు నష్టం కలిగేలా నిర్వాహకులు మైనింగ్ ఏర్పాటు చేశారని ఆమె తెలిపారు. సమగ్ర నివేదిక తయారుచేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

సరిపడా ఎరువులు నిల్వ ఉంచండి : డీఏఓ



ఫర్టిలైజర్ దుకాణంలో మాట్లాడుతున్న డీఏఓ నర్సింహారావు

కల్హేర్(నారాయణఖేడ్): ఫర్టిలైజర్ దుకాణాల్లో రైతులకు సరిపడా ఎరువులు సిద్ధంగా ఉంచాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి(డీఏఓ) నర్సింహారావు ఆదేశించారు. శుక్రవారం కల్హేర్‌లో ఫర్టిలైజర్ షాపులు తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్, రికార్డులను పరిశీలించారు. దుకాణాల్లో స్టాక్ బోర్డు, ధరల పట్టిక అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో పారిశుద్ధ్యం పనులు పరిశీలించారు. అలాగే మండల పరిషత్‌లో పంచాయతీ సెక్రటరీలు, ఈజీఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతు వేదికలో రైతు బీమా నమోదు వివరాలు పరిశీలించారు. రుణ మాఫీపై రైతులకు సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ శివ శ్రీనివాస్, ఏఓ శ్రీకాంత్, ఏఈఓలు సతీష్, సంతోష పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



వంకాయ పంట సాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

న్యాల్‌కల్(జహీరాబాద్): ఆధునిక పద్ధతులతో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని జహీరాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సాయి ప్రియాంక అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గంగ్వార్ గ్రామంలో పంటల సాగు విధానంపై ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వంకాయ పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. అలాగే పొలాల్లో ఫెరోమోన్ ట్రాప్‌ల ఏర్పాటు గురించి వివరించారు.

జెడ్పీలో నిధుల గోల్‌మాల్

నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు డ్రా

- రాష్ట్ర ఆడిట్ శాఖ అభ్యంతరాలు
- అసెంబ్లీలో ప్రవేశపెట్టిన నివేదికలో అక్షింతలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : జిల్లా పరిషత్‌లో జరిగిన నిధుల గోల్‌మాల్‌పై రాష్ట్ర ఆడిట్ శాఖ అక్షింతలు వేసింది. శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఆడిట్ నివేదికలో జెడ్పీలో జరిగిన అక్రమాలు, అవకతవకలకు సంబంధించిన వివరాలను ప్రత్యేకంగా పేర్కొంది. అధికారులు, గత పాలకవర్గం ప్రజాప్రతినిధులు కలిపి జెడ్పీ నిధులను ఇష్టానుసారంగా డ్రా చేసినట్లు తేల్చారు. ఈ అక్రమాలపై తీవ్ర అభ్యంతరాలను శాసనసభకు అందించిన నివేదికలో పేర్కొన్నారు. అందులో మచ్చుకు కొన్ని పరిశీలిస్తే..



మౌలిక సదుపాయాల పేరుతో రూ.30 లక్షలు డ్రా..

జిల్లా పరిషత్‌లో సాధారణ నిధుల నుంచి రూ.30 లక్షలు డ్రా చేశారు. కొత్త జెడ్పీ భవనంలో మౌలిక సదుపాయలను కల్పించడం పేరుతో ఈ బిల్లులను ఓ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు కట్టబెట్టారు. రూ.కోట్లు పెట్టి నిర్మించిన ఈ భవనంలో ఇంకా మౌలిక సదుపాయాలు ఏం కల్పించాల్సి వచ్చిందో అధికారులకే తెలియాలి. డ్రా చేసిన ఈ నిధులకు సంబంధించి అధికారులు రికార్డుల్లో లెక్కలు చూపలేదు. దీనిపై అభ్యంతరం తెలిపిన కాగ్ వెంటనే ఈ నిధుల లెక్క తేల్చాలని నివేదికలో పేర్కొంది. గత పాలకవర్గం పెద్దలు చేసిన అక్రమాలకు అధికారులు తలూపడంతో ఇప్పుడు రాష్ట్ర ఆడిట్‌శాఖ నుంచి అక్షింతలు పడ్డాయి.

ఎంబీ రికార్డులు లేకుండా రూ.16.28 లక్షలు..

జెడ్పీ అధికారులు బరితెగించారు. కనీసం ఎంబీ రికార్డులు కూడా లేకుండానే ఓ కాంట్రాక్టరుకు రూ.16.28 లక్షల బిల్లులు కట్టబెట్టారు. ఈ అక్రమాన్ని ఆడిట్ అధికారులు గుర్తించారు. ఈ నిధులకు సంబంధించిన వివరాలను వెంటనే సమర్పించాలని ఆదేశించింది.

ఎస్సీ, ఎస్టీల నిధులనూ వదల్లేదు..

జిల్లా పరిషత్‌కు సాధారణ నిధులు ఉంటాయి. ఈ నిధుల నుంచి నిర్ణీత మొత్తంలో 15 శాతం ఎస్సీ సంక్షేమానికి, ఆరు శాతం ఎస్టీల సంక్షేమానికి ఖర్చు చేయాలి. ఒకవేళ ఖర్చు చేయని పక్షంలో ఆ నిధులను ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖలకు బదిలీ చేయాలనేది చట్టం చెబుతోంది. కానీ అక్రమాల్లో ఆరితేరిన అధికారులు, పాలకవర్గం నేతలు కలిసి ఈ నిబంధనలను తుంగలో తొక్కారు. అడిగే నాథుడే లేకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరించారు. దీనిపై కూడా కాగ్ మొట్టికాయ వేసింది.

అత్యధిక అభ్యంతరాలు సంగారెడ్డి జెడ్పీవే..

రాష్ట్ర ఆడిట్‌శాఖ రాష్ట్రంలో ఉన్న అన్ని జెడ్పీలు, మండల పరిషత్‌లు, గ్రామ పంచాయతీల్లో నిధుల వ్యయంపై ఏటా ఆడిట్ నిర్వహించి ప్రభుత్వానికి నివేదికలు పంపుతుంది. అయితే శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఈ ఆడిట్ నివేదికలో అత్యధిక అభ్యంతరాలు సంగారెడ్డి జెడ్పీవే ఉండటం గమనార్హం.

పటాన్‌చెరు మండల పరిషత్‌లో భారీగా నిధుల గోల్‌మాల్ జరిగినట్లు బయటపడింది. ఈ మండల పరిషత్‌కు పటాన్‌చెరు బస్టాండ్ సమీపంలో సుమారు 20 దుకాణాలుంటాయి.

పటాన్‌చెరు షాపింగ్ కాంప్లెక్స్ అద్దె డబ్బులూ..

కాంప్లెక్స్ అద్దె నిధులను అధికారులు పక్కదారి పట్టించారు. ఈ కాంప్లెక్స్ నుంచి ప్రతినెలా వచ్చే అద్దెను కార్యాలయానికి సంబంధించిన అధికారి పీడీ ఖాతాలో జమ చేయాలి. కానీ నిబంధనలకు విరుద్ధంగా ప్రత్యేక ఖాతాను తెరిచి అందులోంచి నిధులను డ్రా చేశారు. ఇలా సుమారు రూ.14.01 లక్షల నిధుల్లో అవకతవకలకు పాల్పడినట్లు కాగ్ తేల్చింది. ఈ అక్రమాన్ని ఆడిట్ అధికారులు గతంలో పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ అక్రమాలకు మరిగిన అధికారులు కనీసం పట్టించుకోలేదని కాగ్ అక్షింతలు వేసింది. మరోవైపు 2020 నుంచి ఈ కాంప్లెక్స్ నుంచి అద్దెలు వసూలు చేయలేదని ఆడిట్‌లో తేలింది. నగరంలో వాణిజ్యపరమైన ఈ షాపుల అద్దెలను వసూలు చేయకపోవడం వెనుక ఉన్న ఆంతర్యమేంటో అనేది అధికారులకు తెలియాలి.

పకడ్బందీగా 'స్వచ్ఛదనం పచ్చదనం'

కలెక్టర్ క్రాంతి



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్ : 'స్వచ్ఛదనం పచ్చదనం' కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. శుక్రవారం మండలాలు, మున్సిపాలిటీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వివిధ శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పరస్పర సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఆగస్టు 5 నుంచి 9 వరకు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. తాగునీటిని శుద్ధి చేయాలన్నారు. పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీపీఓ సాయిబాబా పాల్గొన్నారు.

సమర్థవంతంగా నూతన చట్టాల అమలు



రివ్యూ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

ఎస్పీ రూపేష్

సంగారెడ్డి : నూతన చట్టాలపై అవగాహన పెంచుకొని సమర్థవంతంగా అమలు చేయాలని ఎస్పీ రూపేష్ ఆదేశించారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులను ముందస్తు విచారణ చేసి, అవసరమైతే సంబంధిత అధికారుల ఉత్తర్వులు పొంది ప్రాథమిక విచారణ చేపట్టాలని సూచించారు. ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు కలిసి నేరం చేస్తే ఆర్గనైజ్డ్ క్రైంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ కేసులో నేరస్తుల ఫొటోలు, వీడియో రికార్డు చేయాలని, గ్రేవ్ కేసులలో అరెస్ట్ చేసిన నేరస్తులకు హ్యాండ్ కాఫ్స్ వేయాలని సూచించారు. ఇక నుంచి నూతన చట్టాల ప్రకారం సమన్స్, వారెంట్స్ ఆన్‌లైన్ ద్వారా అందజేయవచ్చన్నారు. కొత్త చట్టాల అమలులో ప్రతిభ కనబర్చిన అధికారులకు రివార్డులు అందిస్తామని తెలిపారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ముగిసిన ఏసీబీ సోదాలు

రూ.96 వేల నగదు, 56 డాక్యుమెంట్లు సీజ్


కంది(సంగారెడ్డి) : కంది జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల సోదాలు ముగిశాయి. ఏసీబీ డీఎస్పీ ఉదయ్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రాత్రి మొదలైన సోదాలు శుక్రవారం ఉదయం వరకు కొనసాగాయి. తనిఖీల్లో రూ.96వేల నగదు తోపాటు 56 డాక్యుమెంట్లను సీజ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. అధికారులను చూసిన కొందరు కిటికీల నుంచి విసిరేసిన డబ్బును రికవరీ చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. ప్రతీరోజు వందల సంఖ్యలో వచ్చే డాక్యుమెంట్లు ఏసీబీ అధికారుల సోదాల నేపథ్యంలో శుక్రవారం రిజిస్ట్రేషన్లకు తక్కువ మంది వచ్చారు. కేవలం 13 రిజిస్ట్రేషన్లు మాత్రమే చేసినట్లు అధికారులు తెలిపారు.

'ధరణి'తో రెవెన్యూ వ్యవస్థ చిన్నాభిన్నం

అసెంబ్లీలో ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన 'ధరణి'తో రెవెన్యూ వ్యవస్థ చిన్నాభిన్నమైందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి విమర్శించారు. శుక్రవారం అసెంబ్లీలో జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ.. గతంలో ఆర్వోఆర్ యాక్టుతో రైతులు, భూ యజమానులు హక్కులు కోల్పోకుండా ఉన్నారన్నారు. ధరణిలో కాస్తు కాలం తొలగించడంతో అనేక సమస్యలు వచ్చాయన్నారు. సాదా బైనామాల ద్వారా అమ్మినా పాతయజమానుల పేర్లే ధరణిలో నమోదయ్యాయన్నారు. 30, 40 ఏళ్ల కిందట భూములు అమ్ముకొని అమెరికాలో స్థిరపడ్డవారి పేర్లు ధరణిలో చేర్చారన్నారు. భూమి కొనుగోలు పథకం కింద ఇళ్లస్థలాల పంపిణీ కోసం ప్రభుత్వం సేకరించిన భూములు సైతం అమ్మినవారి పేర్లపై నమోదు చేశారన్నారు. ఖేడ్ నియోజకవర్గంలోని నిజాంపేటలో 40 మందికి ఇళ్లపట్టాలు ఇవ్వగా పోలీసులతో ఖాళీ చేయిస్తే తాము అడ్డగించామన్నారు. పెద్దశంకరంపేట మండలంలో మూడుతరాల నుంచి పేదలు సాగు చేసుకుంటున్న భూములను సైతం లాక్కున్నారని ఆయన సభ దృష్టికి తీసుకొచ్చారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఖేడ్ నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ శుక్రవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి హైదరాబాదులో సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రహదారులు, భవనాలు, ఇతర అభివృద్ధి పనులు, వాటి ఆవశ్యకత గురించి వివరించారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే వివరించారు.

గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



పాపన్న గౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

హత్నూర(సంగారెడ్డి): కల్లుగీత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని దేవులపల్లిలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర 18వరకు కొనసాగుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, జిల్లా కార్యదర్శి ప్రసాద్ గౌడ్, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



రోగులకు అందించే ఆహారాన్ని తింటున్న డీసీహెచ్ఎస్ సంగారెడ్డి

పటాన్‌చెరు టౌన్: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీసీహెచ్ఎస్ సంగారెడ్డి ఆదేశించారు. శుక్రవారం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. అక్కడ అన్ని విభాగాలను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న ఆహారాన్ని సిబ్బందితో కలిసి తిని నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి వైద్యులతో సమావేశం నిర్వహించారు కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి, ఆర్ఎం ప్రవీణ, వైద్యులు పాల్గొన్నారు.

'అసైన్డ్' స్వాహా!

- అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూములు మాయం
- అక్రమంగా ప్లాట్లు చేసి విక్రయం
- అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కు
- రూ.20 కోట్ల వరకు కుంభకోణం



అక్రమంగా వెలసిన వెంచర్‌లోని ఇళ్లు

పటాన్ చెరు: అక్రమార్కులు ప్రభుత్వ భూమిని కూడా వదలడం లేదు. జాగా కనిపిస్తే చాలు పాగా వేస్తున్నారు. నిబంధలనకు విరుద్ధంగా అసైన్డ్ భూముల్లో ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. అధికారులు, రాజకీయ నాయకులు ఒక్కటై ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ప్రజల ఫిర్యాదులు చేస్తే కానీ రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని విమర్శలు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో జరిగే కబ్జాలను కనీసం పట్టించుకోవడం లేదని జనం ఆరోపిస్తున్నారు.

అనుమతులు లేకుండా నిర్మాణాలు

అమీన్‌పూర్ పట్టణంలోని సర్వేనెంబర్ 993, 630లోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను దర్జాగా అమ్ముకుంటున్నారు. పట్టణంలోని టైలర్స్ కాలనీ వెనుక శ్మశాన వాటికను ఆనుకుని ఉన్న భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. ఆ భూమి మాజీ సైనిక ఉద్యోగునికి కేటాయించారని చెబుతున్నారు. ఆ భూమి క్రయవిక్రయాలకు కలెక్టర్ ఎన్‌ఓసీ ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాత హెచ్ఎండీఏ అనుమతులతో లేఅవుట్ వేసి ప్లాట్లు చేసి విక్రయించాలి. పార్కు స్థలం ఇతర సామాజిక అవసరాల కోసం వదిలి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వీధి దీపాలు వేసి మరీ ప్లాట్లు విక్రయించాలి. కానీ అవేవీ లేకుండా ఆ భూమిలో ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారు. ఇందుకోసం అక్కడ తాత్కాలిక నిర్మాణాలను కూడా మొదలుపెట్టారు. ఎలాంటి దస్తావేజులు లేకుండా ప్లాట్లను కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఇండ్లు కట్టి మరీ విక్రయిస్తున్నారు. ఆ ఇళ్ల నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేవు. అక్రమ పద్ధతుల ఇంటి నంబర్లు సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారు. అలా సృష్టించే ఇంటి నంబర్ల పేరిట రిజిస్ట్రేషన్ చేసి విక్రయించాలని కూడ ప్రణాళికలు వేశారని తెలిసింది.

అధికారుల పర్యవేక్షణేది?

ఈ అక్రమ ప్లాట్ల వ్యవహారంపై మున్సిపల్ అధికారులను ప్రశ్నిస్తే.. ఆ భూమి తమ పరిధిలోకి రాదని రెవెన్యూ అధికారులే పర్యవేక్షించాల్సి ఉంటుందని సమాధానం ఇస్తున్నారు. అమీన్‌పూర్ పట్టణంలో ఎకరా భూమి విలువ రూ.20 కోట్లకు పైగా ఉంటుంది. సర్వేనెంబర్ 993లో కబ్జాకు తెర లేపిన భూమి విలువ దాదాపు రూ.20 కోట్ల వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ అక్రమ వ్యవహారాన్ని అడ్డుకోవాలని పట్టణానికి చెందిన కౌన్సిలర్లు సదువుల మల్లేశం, యూనుస్‌లు జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదు వచ్చింది.. ఆరా తీస్తున్నాం

అమీన్‌పూర్ పట్టణంలో టైలర్స్ కాలనీ వెనుక అక్రమ పద్ధతిలో వెంచర్ వేసి జాగాలు అమ్ముతున్నారని తెలిసింది. ఆ భూమి వివరాలు నాకు తెలియదు. అది ప్రభుత్వ భూమా..? అసైన్డ్ భూమా..? క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తాం. స్థానిక కౌన్సిలర్లు ఇచ్చిన ఫిర్యాదులను జిల్లా అధికారులు మాకు పంపించారు. వివరాలు తెలుసుకొని ఉన్నతా అధికారులకు నివేదిక ఇచ్చి తగిన చర్యలు తీసుకుంటాం.

– రఘునాథ్ రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, అమీన్‌పూర్

క్లుప్తంగా

అనారోగ్యంతో చంద్రకాంతశర్మ కన్నుమూత

నాలుగు దశాబ్దాలపాటు నాచగిరిపై తనదైన ముద్ర



చంద్రకాంతశర్మ (ఫైల్)

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధ పుణ్య క్షేత్రం నాచారం గుట్ట శ్రీలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం రిటైర్డ్ వేదపండితులు జ్యోషి చంద్రకాంతశర్మ(72) గురువారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూశారు. నాచారం గుట్ట దేవస్థాన వేదపండితునిగా 1976లో ఆయన నియమితులై 2018లో పదవీ విరమణ పొందారు. వేదం..చంద్రకాంతం అన్నట్లు నాలుగు దశాబ్దాలపాటు వేదఘోషతో నాచగిరిపై తనదైన ముద్రవేశారు. నాచగిరీశుని సేవలో తరిస్తూనే అక్కడి మల్లినాథసూరి వేదపాఠశాల ద్వారా అనేక మంది విద్యార్థులకు వేద విద్య నేర్పించారు. రాష్ట్ర ఉత్తమ వేదపండితుడిగా, జిల్లా ఉత్తమ వేద పండితుడిగా అనేక అవార్డులు సొంతం చేసుకున్నారు. ఆయన మృతిపై ఆలయ ఈఓ అన్నపూర్ణ, ఆలయ సిబ్బంది, అర్చకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు చంద్రకాంతశర్మకు భార్య గిరిజ, కూతురు వెంకటలక్ష్మి, అల్లుడు శశిధర్‌శర్మ ఉన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం అంత్యక్రియలు జరిగాయి.

అటవీ భూమి చదును



భూమిని పరిశీలిస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): అటవీ భూమిని రెండు రోజులుగా చదును చేస్తూ కబ్జాకు పాల్పడుతున్న ఘటన మండల పరిధి పూర్వ కొత్తపేట పంచాయతీ పరిధిలో చోటు చేసుకుంది. కొత్తపేట అటవీ కంపార్ట్‌మెంట్ 53లో పలువురు గిరిజనులు రాత్రివేళల్లో అటవీ భూమిని చదును చేసి దున్నకం చేపట్టారు. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు ఆ భూమిని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకట్‌రావుపేట సెక్షన్ ఆఫీసర్ కరిమొద్దీన్ మాట్లాడుతూ.. కొత్తపేట కంపార్ట్‌మెంట్ పరిధిలో పలువురు గిరిజనలు రాత్రివేళల్లో చదును చేసి దున్నకం చేపట్టారని తెలిపారు. కబ్జాలకు పాల్పడిన జర్పుల తుకారాం, రాజు, నెహ్రూలపై కేసులు నమోదు చేశామన్నారు.

పెళ్లి భయంతో..

పురుగు మందు తాగి యువతి ఆత్మహత్య

చేర్యాల(సిద్దిపేట): పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని ఆకునూరులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పుప్పాల వెంకటేశ్వర్లు చిన్న కూతురు మహేశ్వరి(25)కి ఇటీవల పెళ్లి సంబంధం చూశాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకి పాల్పడింది. గమనించిన పొరుగు వారు విషయం తండ్రికి తెలిపారు. వెంటనే ఇంటికెళ్లిన తండ్రి బంధువుల సాయంతో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పెళ్లి అంటే భయంతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు.

రోగి చనిపోయినా చికిత్స చేశారు

- కుటుంబ సభ్యుల ఆందోళన
- గచ్చిబౌలి కేర్ ఆస్పత్రిలో నర్సాపూర్ వాసి మృతి

రాయదుర్గం: గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రిలో శుక్రవారం ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. బాధితుల కథనం మేరకు.. మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణానికి చెందిన వెంకటేశ్ అనారోగ్య కారణాలతో కొద్ది రోజుల కిందట గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రిలో చేరారు. ఇప్పటి వరకు వైద్య ఖర్చుల కోసం రూ.5 లక్షల రోగి బంధువులు చెల్లించారు. తెల్లవారుజాము వరకు ఆరోగ్యంగా ఉన్న వెంకటేశ్ ఆకస్మాత్తుగా మృతి చెందాడు. అయినా రోగికి ట్రీట్‌మెంట్ చేశారని, అతడు బతకాలంటే రూ.4 లక్షలు చెల్లించాలని ఆస్పత్రి యాజమాన్యం డిమాండ్ చేసినట్లు ఆరోపించారు. అనుమానంతో ఆస్పత్రి ఐసీయూ అద్దాలు పగులగొట్టి చూడగా అప్పటికే వెంకటేశ్ మృతి చెంది కనిపించాడు. దీంతో కోపోద్రిక్తులైన కుటుంబసభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. బాధితులను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పరామర్శించారు.



చేప పిల్లల పంపిణీ పథకం ఈ ఏడాది ఆలస్యమేలా కనిపిస్తోంది. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖ కార్యాలయంలో బిడ్లకు సంబంధించి టెండరు బాక్స్‌లు తెరవగా ఒక్కరు కూడా టెండర్‌లో పాల్గొనకపోవడంతో అధికారులు అవాక్కయ్యారు. ఈ నెలలోనే చెరువుల్లో చేప పిల్లలు వదిలేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అందుకు సంబంధించి విధివిధానాలు ఖరారు చేశారు. కానీ గుత్తేదారులు బిడ్ దాఖలు చేయలేదు. ఈ క్రమంలో టెండర్ గడువును 13వ తేదీ వరకు పొడిగించి మరోసారి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. జీరో టెండర్ కావడంపై అధికారులు సైతం చర్చించుకుంటున్నారు.

–వట్‌పల్లి(అందోల్)

చేప.. చెరువుకు చేరేనా?

- పిల్లల పంపిణీకి జీరో టెండర్లు!
- నిన్నటితో ముగిసిన గడువు.. ముందుకు రాని కాంట్రాక్టర్లు
- జిల్లాలోని చెరువులు 1,160, లక్ష్యం 3.41 కోట్లు
- మరోసారి గడువు పెంచిన అధికారులు
- నాణ్యతాలోపం, బిల్లుల చెల్లింపులో ఆలస్యమే కారణమా?

జిల్లాలో మొత్తం 1,160 చెరువులు, కుంటలు ఉన్నాయి. 227 మత్స్య సహకార సంఘాలు ఉండగా వీటిలో 11,013 మంది సభ్యులు ఉన్నారు. ఈ ఏడాది 3.41 కోట్ల చేప పిల్లలు వదలాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ అధికారులు ఎంచుకున్న లక్ష్యానికి చెరువుల్లో వదులుతున్న దానికి ఏ మాత్రం పొంతన కుదరడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. నిర్ణయించిన లక్ష్యంలో వంద శాతం చేప పిల్లలను వదులుతున్నట్లు ప్రకటనలు ఇస్తున్నా అదంతా ఉత్తదేనని మత్స్యకారులు అంటున్నారు. కేవలం 60 నుంచి 70 శాతం వరకే చేప పిల్లలు వదిలిమమ అని పించుకుంటున్నారు.

సైజు తక్కువగా ఉండటంతో..

జిల్లాలోని చెరువుల్లో ఈసారి బంగారు తీగ, కట్లా, మ్రిగాల, రోగు అనే రకాల చేప పిల్లలను వదలాలని నిర్ణయించారు. అయితే చేప పిల్లల్లో నాణ్యత ఉండడం లేదన్న ఆరోపణలున్నాయి. అధికారులు చెరువుల వద్దకు చేప పిల్లలను తీసుకొచ్చే సమయంలోనే చాలా వరకు చనిపోయి ఉంటున్నాయని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. చేప పిల్లల్లో నాణ్యత లోపించడంతో సైజు పెరగడం లేదంటున్నారు. సాధారణంగా పిల్లలను చెరువుల్లో వదిలే సమయంలో 82 ఎంఎం, 35 ఎంఎం నుంచి 40 ఎంఎం వరకు ఉండాల్సి ఉండగా అంతకు తక్కువగా ఉంటున్నాయన్నారు. కొన్ని చోట్ల సైజు తక్కువగా ఉందని వెనక్కి పంపిన సందర్భాలు ఉన్నాయి. నాసిరకం చేప పిల్లలను చెరువుల్లో వదిలితే వాటి ఎదుగుదల ఉండదని మత్స్యకారులు వాపోతున్నారు. చాలా చిన్న పిల్లలు కావడంతో లెక్కల్లో కూడా తేడా వస్తోందని చెప్పారు. లక్ష పిల్లల వదిలామని అధికారులు చెబుతున్నా 70 నుంచి 80 వేలు కూడా ఉండటం లేదని వాపోతున్నారు. ఈ సారైనా అధికారులు నాణ్యమైన చేప పిల్లలను పంపిణీ చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

బకాయిలు చెల్లించకపోవడమే కారణమా?

ప్రభుత్వం జిల్లాలోని చెరువుల్లో చేప పిల్లలకు సంబంధించి పది రోజుల కిందట బిడ్లు వేయడానికి అవకాశం కల్పిస్తూ ప్రకటన చేసినా 2వ తేదీ వరకు ఒక్క టెండరు కూడా రాకపోవడానికి కారణాలను అధికారులు వెతుకుతున్నారు. ముఖ్యంగా గతేడాది ప్రభుత్వానికి సరఫరా చేసిన చేప పిల్లలకు సంబంధించి బిల్లులు ఇప్పటి వరకు చెల్లించకపోవడంతో ముందుకు రాలేదని తెలుస్తుంది. రాజమండ్రి, కైకలూరు ప్రాంతాలకు చెందిన కాంట్రాక్టర్లు మాత్రమే ఈ ప్రాంతంలో చాలా కాలంగా టెండర్లలో పాల్గొంటున్నారు. అధికారులు మరోసారి టెండర్ గడువును 13వ తేదీ వరకు పొడిగించారు.

> **టెండర్ వేయడానికి ముందుకు రావాలి**
>
> జిల్లాకు చేప పిల్లలను పంపిణీ చేసేందుకు గత నెలలో బిడ్లకు ఆహ్వానించినా చివరి వరకు ఒక్కటీ కూడా రాలేదు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకుపోగా ఈనెల 13వ తేదీ వరకు మరోసారి బిడ్లు వేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. బిడ్‌లో పాల్గొనే వారు నిర్ణయించిన తేదీల్లో టెండర్లలో పాల్గొనాలి. జిల్లాలో చేపపిల్లల పంపిణీకి 3.41 కోట్లు టార్గెట్ నిర్ణయించాం. జిల్లాలో మొత్తం చెరువులు, కుంటలు 1,160 ఉన్నాయి.
>
> – సుధాకర్, మత్స్యశాఖ ఏడీ, సంగారెడ్డి

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ వెంకటయ్య



స్కిల్ ప్రోగ్రామ్ ముగింపులో వెంకటయ్య, తదితరులు

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన స్కిల్ ప్రోగ్రామ్ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. కబడ్డీ, వ్యాసరచన, సైన్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతోపాటు, విద్యా ప్రమాణాలను పెంచే లక్ష్యంతో పని చేస్తున్న ఎర్త్ ఫౌండేషన్‌ను అభినందించాల్సిన విషయమన్నారు. విద్యార్థుల ఆలోచనలు తప్పుదోవ పట్టకుండా పుస్తక పఠనంతోపాటు ప్రత్యేక మోటివేషన్ తరగతులను నిర్వహించాలని టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌ఓ భాస్కర్, ఎర్త్ ఫౌండేషన్ అధ్యక్షుడు పెద్ది ప్రమోద్, డైరెక్టర్ వెన్నెల, స్కిల్ ప్రోగామ్ కో ఆర్డినేటర్ ఆంజనేయులు, రాజు, టీం సభ్యులు నాగలక్ష్మి, హిమబిందు, సురేశ్, భార్గవి, ప్రశాంత్, స్వామి, నిహారిక, కౌశిక్, ఇమ్రాన్, పాఠశాల టీచర్లు పాల్గొన్నారు.

గుండెపోటుతో భూ నిర్వాసితుడు మృతి

నర్సాపూర్ రూరల్: గుండెపోటుతో భూ నిర్వాసితుడు మృతి చెందిన ఘటన నర్సాపూర్ మండలం చిన్న చింతకుంటలో శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం మేరకు..గ్రామానికి చెందిన వంటేరు రాంరెడ్డి (62)కి ఉన్న రెండు ఎకరాల భూమి కొండపోచమ్మ నుంచి సంగారెడ్డికి వెళ్లే రీచ్ టు కాల్వకు ప్రభుత్వం తీసుకుంటుందని కొద్ది రోజుల కిందట అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి నుంచి బెంగతో ఉంటూ అనారోగ్యానికి గురవుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కాల్వ కోసం భూములు ఇవ్వమని 22 రోజులుగా చింతకుంట గ్రామస్తులు రిలే దీక్షలు చేస్తున్నారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో బెంగ పెట్టుకొని గుండెపోటుతో మృతి చెందాడని తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవడంతోపాటు నష్ట పరిహారం మొత్తం చెల్లించాలని డిమాండ్ చేస్తూ నర్సాపూర్–మెదక్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. పోలీసులు రాస్తారోకోను విరమింపజేశారు.

బైక్ టైర్‌లో చున్నీ చుట్టుకొని మహిళ..

పటాన్‌చెరు టౌన్: బైక్‌పై నుంచి పడి మహిళ మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మెదక్ జిల్లా పాపన్నపేటకు చెందిన అక్తరి బేగం భర్త ఖుర్షిత్ శుక్రవారం హైదరాబాద్ వైపు నుంచి పాపన్నపేట వైపు వెళ్తున్నారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి ఓఆర్‌ఆర్ సమీపంలోకి రాగానే బైక్ వెనుకాల కూర్చున్న అక్తరి బేగం(50) మెడలో ఉన్న చున్ని బైకు వెనుక టైర్‌లో పడింది. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి కిందపడటంతో బేగంకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతురాలి కూతురు అస్రా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

హైనా దాడిలో దూడ..

చేగుంట(తూప్రాన్): హైనా దాడిలో దూడ మృతి చెందిన ఘటన మండలంలోని ఇబ్రహీంపూర్ శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తులు, రైతుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గడ్డ చంద్రం తన పశువులను వ్యవసాయ పొలం వద్ద కట్టేశాడు. గురువారం రాత్రి గుర్తు తెలియని జంతువు దూడను చంపేసింది. శుక్రవారం సమీప పొలాల రైతులు దూడ చనిపోవడం గుర్తించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. దూడను హైనా చంపి తిని ఉంటుందని గ్రామ రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అక్కాతమ్ముడు అదృశ్యం

టేక్మాల్(మెదక్): అక్కా తమ్ముడు అదృశ్యమైన ఘటన టేక్మాల్ మండలంలోని ఎల్లుపేట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ తుక్కయ్య కథనం మేరకు.. ఎల్లుపేట గ్రామానికి చెందిన మూడ రాములు ఐదు నెలల కిందట మృతి చెందగా.. భార్య పదేళ్ల కిందట మృతి చెందింది. వీరి పిల్లలు మూడ శ్రీలత(18), శివప్రసాద్(12) పెద్దనాన్న నర్సింలు ఇంటి వద్దే ఉంటూ చదువుకుంటున్నారు. రోజు మాదిరిగానే ఒకటో తేదీన ఉదయాన్నే వ్యవసాయ పనులకు వెళ్లిన నర్సింలు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఇంటికొచ్చాడు. ఇంటి వద్ద శ్రీలత, శివప్రసాద్ కనిపించలేదు. వారి వద్ద ఉన్న నంబర్లకు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. గ్రామ చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఇంట్లో ఉన్న సమయంలో శ్రీలత ఎరుపు రంగు పంజాబీ డ్రెస్, శివ ప్రసాద్ ప్యాంటు, షర్టు ధరించి ఉన్నట్లు తెలిపారు. నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఇంటి నుంచి బయటికి వెళ్లి వ్యక్తి..

న్యాల్‌కల్(జహీరాబాద్): ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. హద్నూర్ పోలీసుల కథనం మేరకు.. మల్గి గ్రామానికి చెందిన మొల్లవాలే చాంద్ పాష(38) గత నెల 26న పని నిమిత్తం బీదర్‌కు వెళ్లాడు. రాత్రి గడిచినా ఇంటికి తిరిగి రాలేదు. చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మానసిక వ్యాధితో బాధపడుతున్న పాష గతంలోనూ ఇంటి నుంచి వెళ్లి వారం రోజులకు తిరిగి వచ్చాడని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. చాంద్‌పాష మెరూన్ కలర్ షర్టు, నల్లరంగు ప్యాంటు కలిగి ఉన్నాడని, బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఫామ్‌హౌస్ అడ్డాగా పేకాట

- దాడి చేసిన ములుగు పోలీసులు
- 11 మందిపై కేసు నమోదు
- రూ.67,920 నగదుతోపాటు బైక్‌లు, కార్లు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు

ములుగు(గజ్వేల్): పేకాట శిబిరంపై ములుగు పోలీసులు దాడి చేశారు. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన 9 మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఈ ఘటన గురువారం రాత్రి ములుగు మండలం క్షీరసాగర్‌లో చోటు చేసుకుంది. ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. క్షీరసాగర్ గ్రామ శివారులోని ఫామ్‌హౌస్ అడ్డాగా పేకాట స్థావరం నిర్వహిస్తున్నారు. కొంత మంది పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందగా ములుగు ఎస్ఐ విజయ్ కుమార్ సిబ్బందితో కలిసి వెళ్లి పేకాట స్థావరంపై దాడి చేశారు. హైదరాబాద్‌లోని బోయినపల్లికి చెందిన మామిడి మహేందర్‌రెడ్డి, మునుగుల వినయ్, పెండల యాదగిరి, కొండం రాజేంద్రప్రసాద్ (బషీర్‌బాగ్), కాశీపాక నారాయణ(నాంపల్లి), చిత్తారు సురేశ్‌కుమార్(కూకట్‌పల్లి), బత్తుల శివ దుర్గాప్రసాద్ (కాప్రా ఈసీఎల్), నెల్లపాల నరేశ్(వనస్థలిపురం), పింక రాజేందర్ (దమ్మాయిగూడ, ఈసీఎల్)లను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.67,920 నగదుతోపాటు 10 సెల్ ఫోన్లు, 4 బైక్‌లు, 3 కార్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పేకాట నిర్వహిస్తున్న క్షీరసాగర్‌కు చెందిన బొడ్డు నర్సింలు, బోయినపల్లికి చెందిన గడ్డం ప్రవీణ్‌యాదవ్‌లపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఏడుగురు అరెస్ట్

కల్హేర్(నారాయణఖేడ్): పేకాట స్థావరంపై దాడి చేసి జూదరులను అరెస్ట్ చేసినట్లు సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. సిర్గాపూర్ మండలం బొక్కస్‌గాంలో పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు గ్రామానికి చెందిన ఊపాసే వైజ్యనాథ్ ఇంట్లో పేకాట ఆడుతుండగా దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నాం. వారి వద్ద నుంచి రూ.5,420 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

11 మందిపై కేసు నమోదు

సిద్దిపేటకమాన్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు కథనం మేరకు.. పట్టణంలోని శ్రీనగర్ కాలనీలోని ఓ ఇంట్లో అక్రమంగా పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం వచ్చింది. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, వన్ టౌన్ పోలీసులు శుక్రవారం పేకాట స్థావరంపై దాడి పట్టణానికి చెందిన 11 మంది శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్, మైసారెడ్డి, సురేందర్‌రెడ్డి, విశ్వనాథం, గంగాప్రసాద్, మహేశ్, రామాచారి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, రాజిరెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.15,580 నగదుతోపాటు 9 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని చూపుతున్న పోలీసులు

నారాయణఖేడ్: చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నారాయణఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. తుర్కాపల్లి గ్రామానికి చెందిన కుర్మ అంజిగౌండ గత నెల 30న ఇంటికి తాళం వేసి కుటుంబీకులతో కలిసి పొలానికి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో బీరువా తాళాలు పగులగొట్టి బంగారు, వెండి నగలను చోరీ చేశాడు. మన్సూర్‌పూర్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా తుర్కపల్లికి చెందిన గోవిందు మాణిక్యం పోలీసులను చూసి ఆటో దిగి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. విచారణలో అంజిరెడ్డి ఇంట్లో చోరీ చేసింది తానేనని ఒప్పుకున్నాడు. అతడి నుంచి 2.6 గ్రాముల బంగారం, 31.8 గ్రాముల వెండి నగలను స్వాధీనం చేసుకున్నారు. అక్టోబరులో ఖేడ్‌లో ముత్తూట్ ఫైనాన్స్‌లో చోరీకి యత్నించిన కేసులోనూ గోవిందు మాణిక్యం నిందితుడిగా ఉన్నాడు. మద్యం తాగడం, జూదమాడటం జల్సాలకు బానిసై ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ సులువుగా డబ్బులు సంపాదించాలనే చోరీ చేశాడని ఎస్ఐ వివరించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచామన్నారు.

విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించండి

డీఎంహెచ్‌ఓకు కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశాలు

మెదక్‌జోన్: మెదక్‌లోని కేజీబీవీలో ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థిని జ్వరంతో మంచం పట్టింది. మందులు వాడినా తగ్గకపోవడంతో శుక్రవారం మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. హవేళిఘనపూర్ మండలం రాజిపేటకు చెందిన స్వామి కూతురు మానస పట్టణంలోని కేజీబీవీలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. గత నెల 31న కళాశాలలో జ్వరం, దగ్గుతో బాధపడుతుండగా మందులు ఇచ్చినట్లు సిబ్బంది తెలిపారు. విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా వారు గ్రామానికి తీసుకెళ్లి ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించారు. అయినా తగ్గకపోవడంతో శుక్రవారం మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ విద్యార్థినికి సరైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. డీఈఓ, ఎంఈఓలు ఆస్పత్రికి వెళ్లి మానసను హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

బర్దిపూర్‌లో షూటింగ్ సందడి



షూటింగ్ చేస్తున్న నిర్వాహకులు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని బర్దిపూర్ గ్రామ శివారులో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. 50 కేవీ ప్రొడక్షన్ ఆధ్వర్యంలో బాబీ రుద్ర దర్శకత్వంలో నిర్మిస్తున్న సినిమా సంబంధించిన సన్నివేశాలను శుక్రవారం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో తీశారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా, అలవాటు పడితే కలిగే నష్టాల గురించి వివరించడం ఈ సినిమా ప్రధాన ఉద్దేశ్యమని సినీ నిర్వాహకులు పేర్కొన్నారు. మరో రెండు రోజులపాటు షూటింగ్ కొనసాగుతున్నట్లు వివరించారు. షూటింగ్ విషయం తెలుసుకున్న వివిధ గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో చేరుకున్నారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

రూ.66.75 లక్షలు పోగొట్టుకున్న వైనం

పటాన్‌చెరు టౌన్: నకిలీ స్టాక్ మార్కెట్ పేరిట ప్రైవేట్ ఉద్యోగికి టురిడీ కొట్టి భారీగా నగదు కాజేసిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ కాలనీకి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి జూన్ 18 వ తేదీన వాట్సాప్ ద్వారా స్టాక్ మార్కెట్ కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. బాధితుడు తన వివరాలను నమోదు చేశారు. అపరిచిత స్టాక్ మార్కెట్ నిర్వాహకులు ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. అతడు నగదును ఆన్‌లైన్‌లో పెట్టుబడి చేస్తూ వచ్చాడు. మొత్తం రూ.66.75 లక్షలు పెట్టుబడి పెట్టాడు. బాధితుడు చివరగా తాను పెట్టిన నగదుతోపాటు లాభాలు ఇవ్వాలని అడుగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరోచోట రూ.15 లక్షలు

తూప్రాన్: ఓ ఉద్యోగి నుంచి సైబర్ నేరగాళ్లు నగదు కాజేసిన ఘటన పట్టణంలో ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. పట్టణంలోని 12 వార్డులో నివాసం ఉంటున్న ఓ ప్రైవేట్ ఉద్యోగి ఇన్‌స్టాగామ్‌లో ట్రేడింగ్ కోసం వెతికాడు. ఓ లింక్ ఆధారంగా ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్ వాట్సాప్ గ్రూపులో సైబర్ నేరగాళ్లు సదరు వ్యక్తిని చేర్చారు. ఐఐఎఫ్ఎల్ ప్రో అనే యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న వ్యక్తి ట్రేడింగ్ విషయంలో పలు దఫాలుగా రూ.15 లక్షల వరకు చెల్లించాడు. అనంతరం జూలై 5న తన ఐడీబీఐ బ్యాంకు ఖాతాలో రూ.5.10 లక్షలు జమయ్యాయి. ఆ డబ్బులను నేరగాళ్లు మళ్లీ ట్రేడింగ్‌లో పెట్టమని సూచించడంతో సదరు వ్యక్తి వారి మాటలు నమ్మి పెట్టాడు. అనంతరం ఐఐఎఫ్ఎల్ ప్రో యాప్‌లో రూ.95 లక్షలు చూపిస్తున్నప్పటికీ విత్‌డ్రా చేసుకునేందుకు రావడం లేదు. ఆ సంస్థ కస్టమర్ కేర్ నంబర్‌ను సంప్రదించగా రూ.4 లక్షలు చెల్లిస్తే విత్‌డ్రా చేసుకునే అవకాశం వస్తుందని నమ్మబలికారు. వెంటనే బాధితుడు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేద కుటుంబానికి పెద్ద ఆపద

- రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు
- చికిత్స కోసం రూ.20 లక్షలు ఖర్చు
- ఆపన్నహస్తం కోసం కుటుంబీకుల ఎదురుచూపు



కుమారుడి వద్ద రోదిస్తున్న తల్లి సుమిత్ర

దుబ్బాకటౌన్: విధి ఆడిన వింత నాటకంలో ఓ పేద బార్బర్ కుటుంబం చిన్నాభిన్నమైంది. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబానికి పుట్టెడు కష్టం వచ్చింది. దినదినగండంగా దయనీయ పరిస్థితుల్లో ఆస్పత్రిలో రోజులు గడుపుతున్నారు. కుటుంబానికి పెద్ద దిక్కు అయిన తండ్రి మరణించడంతో కుటుంబ భారాన్ని తన భుజాలపై వేసుకున్న 22 ఏళ్ల కుమారుడు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యానికి రూ.లక్షల్లో ఖర్చు అవుతుండటంతో ఆ నిరుపేద కుటుంబం ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది.

బార్బర్‌గా పని చేస్తూ..

దుబ్బాక పట్టణానికి చెందిన రాసమల్లు రమేశ్, సుమిత్ర దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు మణికంఠ ఉన్నాడు. పెద్ద కుమార్తెకు నాలుగేళ్ల కిందటే వివాహం చేశారు. చిన్ని కుమార్తె టైలరింగ్ చేస్తోంది. కుటుంబ పెద్ద దిక్కైన తండ్రి మరణించడంతో కుటుంబ భారం మణికంఠ పై పడింది. సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లోనే ఉంటున్నారు. మణికంఠ దుబ్బాక పట్టణంలో బార్బర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇంతలోనే రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. రాజన్న సిరిసిల్లా జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రానికి పని నిమిత్తం వెళ్లిన మణికంఠ ముస్తాబాద్‌లో బైక్ అదుపుతప్పి కింద పడటంతో తలకు, చెవికి, మెడకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స కోసం హైదరాబాద్‌లో కిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు తమకు తోచినంత డబ్బులు ఇవ్వడంతో మణికంఠ చికిత్స పొందుతున్నాడు.

సాయం చేయాలనుకునే వారు


బ్యాంక్ వివరాలు

పేరు: రాచమల్లు మణికంఠ

అకౌంట్ నంబర్: 22311201000239

ఐఎఫ్ఎస్‌సీ కోడ్: యూబీఐఎన్0822311

ఫోన్ పే, గూగుల్ పే: 99660 36214



మణికంఠ

ఆపరేషన్‌కు రూ. 20 లక్షలు

మణికంఠకు ఆపరేషన్ చేయడానికి రూ.20 లక్షల వరకు ఖర్చవుతుందని డాక్టరు చెప్పారు. తమ వద్ద ఉన్న డబ్బులు మొత్తం కూడబెట్టినా ఆస్పత్రి మందులకు సరిపోవడం లేదని వాపోతున్నారు. మాయందు దయ తలచి దాతలు ఆర్థిక సాయం చేయాలని తల్లి సుమిత్ర కోరుతున్నారు.